www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 5 మార్చి 2023
5
పశ్చిమ గోదావరి



నేడు నిరంతర వైద్య విద్యాబోధన సదస్సు

భీమవరం రూరల్: ఈ నెల 5న భీమవరం పట్టణంలోని పొల్సాన్ నెస్ట్‌లో ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో 'నిరంతర వైద్య విద్యాబోధన' సదస్సు నిర్వహిస్తున్నట్లు మానసిక వైద్య నిపుణులు జివి.రమణారావు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మహత్యల నివారణ, చిన్న పిల్లల్లో ఉండే కుదురులేని స్థితి వ్యాధి నివారణ, చికిత్స, పొగాకు అలవాటు మాన్పించడానికి వచ్చిన కొత్త వైద్య విధానాలు, మానసిక రుగ్మతలకు వాడే మేగ్నెట్ థెరపీ, మానసిక వైద్యంలో కొత్త పోకడలపై సదస్సు జరుగుతుందని తెలిపారు. సదస్సులో జాతీయ అధ్యక్షులు ఎన్ఎన్.రాజు, దక్షిణ భారతదేశపు సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఉదయ్‌కుమార్, భీమవరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, జి.సుభాష్, డాక్టర్ మాదిరెడ్డి స్వరాజ్యలక్ష్మి, మాదిరెడ్డి వెంకటరమణ, పి.శ్రీదేవి, ఆర్‌ఆర్.రాజు, జి.శ్రీవిద్య, సుమారు 150 మంది మానసిక వైద్యులు హాజరవుతున్నారని చెప్పారు.

మొక్కజొన్న రైతు మొర..!

కంపెనీ సీడ్స్‌తో తీవ్రంగా నష్టపోతున్న రైతులు
నాణ్యత లేని సీడ్స్‌తో రెండు టన్నులూ రాని దిగుబడి
సీడ్ కంపెనీలపై కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ
ఆశాజనకంగా కమర్షియల్ పంట ధర
పంట చేతికొచ్చే తరుణంలో ధర నిలకడపై రైతుల్లో గుబులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నూజివీడు మండలం పోలసానిపల్లికి చెందిన రైతు వేముల వెంకట్రావు ఏడెకరాల్లో ఓ ప్రముఖ కంపెనీ ఇచ్చిన మొక్కజొన్న సీడ్స్ సాగు చేశారు. ఎకరాకు నాలుగు నుంచి ఆరు టన్నుల దిగుబడి వస్తుందని కంపెనీ ప్రతినిధులు చెప్పి సీడ్స్ ఇచ్చారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి ఎకరాకు రెండు టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైన రైతు వెంకట్రావు గుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు'.

'మొక్కజొన్న సీడ్స్‌కు చెందిన ఓ కంపెనీ ఇచ్చిన విత్తనాలను నూజివీడు మండలం గొల్లపల్లి పరిసర ప్రాంత రైతులు సాగు చేశారు. నాలుగు టన్నులకుపైగా రావాల్సిన దిగుబడి కాస్తా టన్ను రావడమే గగనంగా మారడంతో రైతులు రోడ్డెక్కి 14 గంటలపాటు ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో నిరవధిక ధర్నా నిర్వహించారు.'

పైన పేర్కొన్న రెండు ఘటనలే కాదు.. కంపెనీలకు సంబంధించిన సీడ్స్ సాగు చేసి నష్టపోయిన ఎంతోమంది రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. మొక్కజొన్న సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు పరిస్థితి తయారైంది. ఏలూరు జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న రైతులు సాగు చేశారు. దీనిలో దాదాపు 65 వేల ఎకరాల్లో కంపెనీలు ఇచ్చిన సీడ్స్‌నే రైతులు సాగు చేశారు. సీడ్స్ ఇచ్చేటప్పుడు ఎకరాకు నాలుగు నుంచి ఆరు టన్నుల దిగుబడి వస్తుందని కంపెనీ ప్రతినిధులు రైతులకు చెప్పి అంటగడుతున్నారు. మూడు నెలల తర్వాత పంట చేతికొచ్చే సమయానికి రెండు టన్నులు కూడా రావడం లేదు. నిబంధనల ప్రకారం సీడ్స్ సాగు చేసిన రైతు నష్టపోతే విత్తనాలు ఇచ్చిన కంపెనీలే రైతులను ఆదుకోవాలి. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వమేనని చెప్పొచ్చు. కంపెనీలు రైతులకు సీడ్స్ ఇచ్చేటప్పుడు అధికారులు జోక్యం చేసుకుని అగ్రిమెంట్లు రాయించే విధంగా చర్యలు తీసుకోవాలి. సీడ్స్ కంపెనీలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ప్రతియేటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నా సీడ్స్ కంపెనీలు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఎంఎల్‌ఎలు, ఎంపిలు సైతం రైతుల గురించి పట్టించుకోకపోవడంతో సీడ్స్ కంపెనీల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. రైతుసంఘాలు జోక్యం చేసుకుని ఆందోళనలు చేస్తే తప్ప రైతులకు ఎంతోకొంత న్యాయం జరగని పరిస్థితి ఉంది. ప్రభుత్వ అధికారులు నష్టపోయిన రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోని దుస్థితి నెలకొంది. నష్టపోయిన రైతులు కొన్నిచోట్ల ఆందోళనలకు దిగుతుండడంతో, మరికొన్నిచోట్ల సీడ్స్ కంపెనీల దురాగతాలను రైతులు మౌనంగా భరిస్తున్నారు. నూజివీడు మండలంలో జరిగిన ఘటనల్లో ఏపీ రైతుసంఘం నాయకులు జోక్యం చేసుకుని రైతులకు ఎంతోకొంత న్యాయం జరిగేలా చేశారు. ఇప్పటికైనా రైతులతో అగ్రిమెంట్లు చేసే విధంగా సీడ్స్ కంపెనీలకు నిబంధనలు అమలు చేయకపోతే మొక్కజొన్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారు కానుంది. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

కమర్షియల్ పంట ధర ఆశాజనకం

జిల్లాలో దాదాపు 35 వేల ఎకరాల్లో మొక్కజొన్న కమర్షియల్ సీడ్‌ను రైతులు సాగు చేశారు. కొద్దిరోజుల్లో పంట చేతికిరానుంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మొక్కజొన్న కమర్షియల్ పంటకు క్వింటాకు రూ.1962 ఉండగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో క్వింటా రూ.2300 నుంచి రూ.2500 వరకూ పలుకుతోంది. పంట చేతికొచ్చే సమయంలో వ్యాపారులు ధర తగ్గించేస్తారేమోనని భయం రైతులను వెంటాడుతోంది. దీంతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ మద్దతు ధరకంటే బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆలోచన చేసే పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ ఇబ్బంది లేకపోయినా ముందుముందు ఇబ్బంది రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్న కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండాలి

నిమ్మగడ్డ నరసింహులు, ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు

మొక్కజొన్న సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలి. సీడ్స్ కంపెనీలతో ఒప్పందాలు(అగ్రిమెంట్లు) చేసుకునేలా రైతుల్లో అవగాహన పెంచాలి. నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కమర్షియల్ సాగు రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

ఎన్నికల నిబంధనల ప్రకారం పని చేయాలి

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి



అధికారులతో మాట్లాడుతున్న డిఆర్‌ఒ కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

ఎంఎల్‌సి ఎన్నికల్లో నిబంధనలపై అవగాహన పెంచుకుని పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో నోడల్ అధికారులతో ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి జిల్లాలో రెండు పోలింగ్ కేంద్రాలు భీమవరం, నర్సాపురం ఎంపిడిఒ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారన్నారు. ఈ రెండు కేంద్రాల్లో 430 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటికే ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీలకు అందించామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ గురించి వివిధ కమిటీల నోడల్ అధికారులకు కృష్ణవేణి వివరించారు. అదనపు ఎస్‌పి ఎవి.సుబ్బరాజు మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే వారు అందరూ నిబద్ధతతో పని చేయాలని, ఎక్కడా ఎన్నికల నియమావళి అతిక్రమించకూడదని సూచించారు. సమావేశంలో భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, డిఎల్‌డిఒ, ఎంసిసి నోడల్ అధికారి కెసిహెచ్.అప్పారావు, వివిధ కమిటీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు సిఎం జగన్ కలగంపూడి రాక

ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు కుమార్తె వివాహానికి హాజరు
పర్యటనా ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్ ప్రశాంతి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని కలగంపూడిలో ఆదివారం జరగనున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహానికి సిఎం జగన్ హాజరు కానున్నారు. ఆయన పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలగంపూడిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను, కల్యాణ వేదికను కలెక్టర్, ఎస్‌పి యు.రవిప్రకాష్, ఇన్‌ఛార్జి జెసి ఎం.సూర్యతేజ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా కేటాయించిన విధులు బాధ్యతతో నిర్వర్తించి ఎక్కడా ఏ చిన్న పొరపాటూ దొర్లకుండా సిఎం పర్యటన విజయవంతం చేయాలన్నారు. అనంతరం సంబంధిత అధికారుల పర్యవేక్షణలో హెలికాప్టర్ ట్రయల్‌రన్, కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. సిఎం జగన్ ఆదివారం సాయంత్రం 4:20 గంటలకు కలగంపూడిలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి బయల్దేరి ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదిక వద్దకు 4.35కు చేరుకుంటారు. అక్కడ వధూవరులను ఆశీర్వదించి 4.55కు అక్కడి నుంచి వెనుదిరిగి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలీకాప్టర్‌లో విజయవాడ బయల్దేరి వెళ్తారు.

మహిళలకు దక్కని సమాన గౌరవం

జిటిపి మహిళా బిఇడి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ధనలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమాజంలో, దేశాభివృద్ధిలో పురుషులతోపాటు సమానంగా మహిళలు కూడా పాటుపడుతున్నారని, అయినప్పటికీ సమాన గౌరవం, అవకాశాలు మహిళలకు లభించడం లేదని జిటిపి మహిళా బిఇడి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ధనలక్ష్మి అన్నారు. శనివారం శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. డిఇడి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జొహన్నా మాట్లాడుతూ మహిళలు కుటుంబం అనే నాలుగు గోడల మధ్యే నలిగిపోతున్నారని, ప్రతి రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, వారి హక్కుల గురించి అవగాహన కల్పించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించుకుంటున్నామని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 'మహిళలపై అత్యాచారాలను అరికట్టాల్సిన సామాజిక బాధ్యత' అనే అంశంపై విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు అధ్యాపకులు ఎస్.నాగేశ్వరరావు, భారతి స్కూల్ ప్రిన్సిపల్ జి.హరికృష్ణ, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

ఏప్రిల్ 7 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కళా పరిషత్ ఆధ్వర్యంలో ఏప్రియల్ 7,8,9 తేదీలలో జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు కెవి.కృష్ణవర్మ తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డులోని అద్దేపల్లి వారి సత్రం ప్రాంగణంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నాటిక పోటీల్లో ప్రదర్శించే ప్రతి నాటికకు రూ.15 వేలు పారితోషకం అందజేయనున్నట్లు ఆ సంస్థ గౌరవాధ్యక్షులు మేడికొండ శ్రీనివాసరావు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు వ్యక్తిగత బహుమతులూ అందజేస్తామని కార్యదర్శి జక్కంపూడి కుమార్ తెలిపారు. పోటీలకు ఏడు నాటికలు ఎంపిక చేశామని కృష్ణవర్మ తెలిపారు. పోటీలకు ముఖ్యఅతిథులుగా స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు ప్రముఖ సినీ నిర్మాత బన్నీ వాసు పాల్గొంటారని సంస్థ ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ చెప్పారు.

ఇళ్ల నిర్మాణం ప్రారంభించేలా చూడాలి: హౌసింగ్ డిఇ

ప్రజాశక్తి - పెనుమంట్ర

నోటీసులిచ్చిన లబ్ధిదారులచే వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభింపజేయాలని హౌసింగ్ డిఇ ఎంవివిఎస్.గోపాలరాజు పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్‌పై వారాంతపు సమీక్ష నిర్వహించారు. గోపాలరాజు మండలంలో 2256 మంది లేఅవుట్ లబ్ధిదారులు ఉండగా, 1020 మంది సొంత స్థల లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. వీరిలో 124 మంది సిమెంటు, ఇసుక మెటీరియల్ పొంది నిర్మాణాలు ఆగిపోవడంతో వారికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. వీరితో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్మాణాలు ప్రారంభించే బాధ్యత తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, హౌసింగ్ ఎఇ మల్లేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎఇ సత్తి నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాసంఘాల పిలుపు

ప్రజాశక్తి - వీరవాసరం

ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రైతన్నలకు మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరుతూ ఏప్రిల్ ఐదో తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు వక్తలు కోరారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఎపి రైతుసంఘం, కౌలురైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ ఢిల్లీ రైతు పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి అన్ని పంటలకూ మద్దతు ధర కల్పిస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు పరిగణనలోకి తీసుకుంటామని, రైతు రుణ విమోచన చట్టం తీసుకొస్తామని, నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని, విద్యుత్ చట్టసవరణ బిల్లును వెనక్కు తీసుకుంటామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ రైతులను, వ్యవసాయ కార్మికులను, కార్మికులను నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి, నేతలు బాలం విజయకుమార్, అయినంపూడి బాబూరావు, కేతా జ్యోతిబసు, మల్లుల సత్యనారాయణ, తాళ్లూరి హరిహరలక్ష్మణ్, పాలా కోటేశ్వరరావు, రెడ్డి రామారావు, పోతుల మృత్యుంజయ పాల్గొన్నారు.

నరసాపురం: కేంద్రంలో బిజెపి ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని రైతు, కార్మిక, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం పిలుపునిచ్చింది. సమావేశం స్థానిక మీరా గ్రంథాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో పెద్దిరాజుతోపాటు ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు తదితరులు మాట్లాడుతూ చలో ఢిల్లీకి జిల్లా నుండి 300 మంది తరలి వెళ్తున్నామన్నారు. దీనిపై ఇంటింటికీ ప్రచారం, జిల్లావ్యాప్తంగా ప్రచార జాతాలు, మోటార్ సైకిల్ యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు ముచ్చర్ల త్రిమూర్తులు, బొక్కా శ్రీనివాసు, గుత్తుల శ్రీరామచంద్రుడు, పిల్లి కామేశ్వరరావు, గుబ్బల నాగేశ్వరరావు, కాకిలేటి ప్రసాదరావు, జల్లి రామ్మోహనరావు, గుంపుల మోహనరావు, కడలి ఆంజనేయులు పాల్గొన్నారు


గర్భిణుల్లో రక్తహీనత తలెత్తకుండా ప్రణాళిక : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం


గర్భిణుల్లో రక్తహీనత తలెత్తకుండా తగిన ప్రణాళికతో ముందుకెళ్లాలని కలెక్టర్ పి.ప్రశాంతి వైద్య శాఖాధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో వివిధ వైద్య అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గర్భిణుల మరణాలకు రక్తహీనత అనేది ప్రధాన అంశంగా తేలిందన్నారు. గర్భిణులు రక్తహీనతకు గురైతే వారిలో పెరిగే శిశువు కూడా సరైన ఎదుగుదల ఉండదన్నారు. గర్భిణులకు రక్తహీనత వల్ల కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు రక్త పరీక్షలను నిర్వహించి వారికి తగిన మందులను అందజేయాలన్నారు. అవి టాబ్లెట్లు, ఇంజెక్షన్లు తదితర ప్రత్యామ్నాయ మార్గాల్లో వారికి ఇష్టమైన రీతిలో మందులను తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. మొదటి కాన్పులో రక్తహీనతకు గురైన వారు, రెండో కాన్పులో కూడా అదే సమస్య తలెత్తడం మన వైద్య సహాయాన్ని ప్రశ్నించుకోవా లన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం పొందిన వారి నుండి వారికి అందిన వైద్య సహాయంపై వివరాలను తెలుసుకుని నివేదికను సమర్పించాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ దేవసుధ పాల్గొన్నారు.

వైసిపిది అరాచక పాలన

జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్


మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

కాళ్ల: వైసిపి ప్రభుత్వానిది అరాచక పాలని అని, దాన్ని ఎదుర్కొనే సత్తా జనసేనకే ఉందని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆ పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి సమావేశం పెదఅమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాలులో శనివారం జరిగింది. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దారుణంగా అణచివేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీరు తెలియక ప్రజలు ఆయనను గెలిపించారన్నారు. మచిలీపట్నంలో ఈ నెల 14న నిర్వహించే జనసేన ఆవిర్భావ జనసేన కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పిఎసి సభ్యుడు వేగేశ్న కనకరాజు, జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ జనసైనికుల కుటుంబాలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటామన్నారు. సుమారు రూ.40 లక్షల విలువైన చెక్కులను బాధిత కుటుంబాలకు అందించామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గవర లక్ష్మిని అభినందించారు. వీరవాసరం మండలం నౌడూరుకి చెందిన కటిక సురేష్, ఉంగుటూరుకు చెందిన వాసుదేవరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరికి మనోహర్ చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నేతలు చేగొండి సూర్యప్రకాష్, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాసు, జుత్తుగ నాగరాజు, రెడ్డి అప్పలనాయుడు, విడివాడ రామచంద్రరావు, మేకా ఈశ్వరయ్య, బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, ఘంటసాల వెంకటలక్ష్మి, చెనమల్ల చంద్రశేఖర్, ఏరుబండి రామాంజనేయులు, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు

కార్మిక నేత కొల్లా వెంకటరత్నం ధన్యజీవి

వర్ధంతి సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో కార్మిక సంఘాల ఐక్యతకు పునాది వేసిన తొలితరం నేత కొల్లా వెంకటరత్నం ధన్యజీవి అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో కొల్లా వెంకటరత్నం వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయ్ మాట్లాడుతూ బజార్ జట్టు, రైస్‌మిల్, సివిల్ సప్లయిస్ తదితర రంగాల కార్మికులకు సంఘాల ఏర్పాటు కోసం, ఆయా సంఘాల్లోని కార్మికుల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి వెంకటరత్నం అని కొనియాడారు. అనారోగ్యంతో ఉన్న తన భార్యకు 25 ఏళ్లపాటు సేవలు చేస్తూనే కార్మికుల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. ప్రజాఉద్యమాల్లో పని చేసే వాళ్లకు ఆయన చూపిన బాట నేటికీ ఆదర్శంగా ఉందన్నారు. సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ కొల్లా వెంకటరత్నం ద్వారా అనేక విషయాలు నేర్చుకున్నామన్నారు. వెంకటరత్నం సేవలను స్మరించుకుంటూ పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కలిపిండి సత్యనారాయణ, బజార్‌జట్టు కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు సూర్యచంద్రరావు, శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మునియ్య పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలకు ఆధార్‌తో ముడిపెట్టొద్దు

ప్రజాశక్తి - తణుకురూరల్

ఉపాధి కూలీలకు వేతనాల చెల్లింపు కోసం ఆధార్‌తో ముడిపెట్టడం తగదని, దీన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వేల్పూరులోని విష్ణుప్రియనగర్‌లో చెత్త నుండి నుండి సంపద తయారీ కేంద్రం వద్ద పని చేస్తున్న ఉపాధి కూలీలను వ్యకాస నేతలు కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 2023-24 బడ్జెట్‌లో ఉపాధి హామీకి కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొద్దోగొప్పో బతుకు భరోసానిస్తున్న ఉపాధి హామీకి మోడీ ప్రభుత్వం బడ్జెట్లో నిధులు తగ్గించి కష్టజీవులైన కూలీల నోటి దగ్గర కూడు లాగేస్తుందని విమర్శించారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీకి అవసరమైన రూ.2.40 లక్షల కోట్లు కేటాయించి పని అడిగిన ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పించి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజుకూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమ ంలో విపర్తి ధనలక్ష్మి, సావిత్రమ్మ, మేరిగ్రేస్, సత్యవతి, రమణమ్మ, సుబ్బలక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

భారాల కష్టాల మోత

వంటింట్లో మోడీ మంటలు
సాగునీటి కోసం రైతన్నల పడిగాపులు
పునాదులు దాటని ఇళ్ల లబ్ధిదారుల కల

ఓపక్క భారాల మోత.. మరోపక్క కష్టాల మోత.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారాల మోత మోగిస్తుంటే.. అవేమీ పట్టని రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్రతో జిల్లా ప్రజలను కష్టాల సుడిగుండంలోకి నెట్టేస్తోంది. గ్యాస్ ధర పెంపు, సాగునీటి కష్టాలు, ఇళ్ల లబ్ధిదారుల అవస్థలు జిల్లావాసులను ఉక్కిరిబిక్కిరి చేశాయి.


ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలవ్వగానే మోడీ సర్కార్ పేద, మధ్యతరగతి ప్రజలపై కొరడా ఝుళిపిస్తూ గృహావసరాలు, వాణిజ్య గ్యాస్ ధర పెంచి వంటింట్లో మంట పెట్టింది. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడంతో జిల్లావాసులు లబోదిబోమంటున్నారు. తమ వేతనాలు, కూలిరేట్లు, పంట ఉత్పత్తుల ధరలు ఏమాత్రం పెరగకపోయినా మోడీ సర్కార్ వచ్చాక గ్యాస్ సిలిండర్ ధర మూడు రెట్లు పెరిగిందని జనం వాపోతున్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి ఉక్కిరిబిక్కిరవుతున్న జనానికి గోరుచుట్టుపై రోకటిపోటులా గ్యాస్ ధర పెంపు పరిణమించిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. దీనికితోడు అపరాలు, వంట నూనె తదితరాల ధర పెరుగుదల కారణంగా ఇప్పటికే హోటళ్లలో తినుబండారాల ధరలు ఆకాశాన్నంటాయి. తాజాగా గ్యాస్ ధర పెంపుతో మరోసారి తినుబండారాల ధరలు పెరగనున్నాయి. ఫలితంగా జనం కడుపుపై మోడీ ధరాఘాతం తగిలినట్లయ్యింది.

సాగునీటి కోసం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రైతులు వంతుల సమయంలో పొలాల వద్ద పడిగాపులు పడుతున్నారు. పూర్తిస్థాయిలో సాగునీటిని అందించే పేరుతో వంతుల విధానం అమలు చేస్తున్నా శివారు ప్రాంతాలకు సాగునీరందని దుస్థితి నెలకొంది. ఉండి, కాళ్ల, ఆచంట, పెనుమంట్ర, భీమడోలు తదితర మండలాల్లో ఇప్పటికే సాగునీటి ఎద్దడి తలెత్తడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ సమయంలో నీటి ఎద్దడి వల్ల దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు పర్యటించి హడావుడి చేసినా కీలకమైన ఆక్వా చెరువులకు సాగునీటి మళ్లింపును కట్టడి చేయకపోవడంతో పరిస్థితి రోజురోజుకీ ఇబ్బందికరంగా తయారవుతోంది. ఎంఎల్‌సి ఎన్నికల హడావుడిలో మునిగి తేలుతున్న ప్రజాప్రతినిధులు సైతం రైతుల కష్టాలపై దృష్టి సారించకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. దీంతో ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని నీటిని తోడుకుని పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఫలితంగా రైతులకు పెట్టుబడి ఖర్చు అనూహ్యంగా పెరిగిపోతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జగనన్నా.. ఇటు చూడన్నా..

జగనన్న లే అవుట్లలో ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది. ఇల్లు కట్టుకుందామంటే లోతట్టు ప్రాంతం కావడం, పూడిక చేశాక ఇల్లు కట్టుకుందామంటే పట్టా రద్దు చేస్తామని అధికారుల హెచ్చరికల నడుమ లబ్ధిదారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇచ్చే కొద్దిపాటి సొమ్ము బేస్‌మెంట్ స్థాయి వరకే సరిపోతుండటం, అప్పు చేస్తేగాని ఇల్లు పూర్తయ్యే పరిస్థితి లేకపోవడంతో లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఫలితంగానే సిపిఎం పరిశీలనలో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు వెలుగుచూశాయి. ఆ పార్టీ పిలుపు మేరకు కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించిన ధర్నాలకు జనం తరలొచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇల్లు కట్టుకోవడానికి సాయం రూ.6 లక్షలకు పెంచడంతోపాటు లేఅవుట్‌లను పూడిక చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

-విఎస్ఎస్‌వి. ప్రసాద్



విధుల పట్ల నిర్లక్ష్యం తగదు
మున్సిపల్ అధికారులకు కలెక్టర్ హెచ్చరిక

ప్రజాశక్తి - భీమవరం

విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడాలని, ఆత్మ సాక్షిగా పని చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంతి భీమవరం సుందరీకరణ పనులపై మున్సిపల్ అధికారులతో సమీక్ష చేసి మాట్లాడారు. నగరంలో పచ్చదనం ఏర్పాటుకు ప్రణాళికను సక్రమంగా అమలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఏర్పడి ఏడాది అవుతున్న మున్సిపల్ సిబ్బంది పనితీరులో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుందన్నారు. డివైడర్ మధ్య ఉన్న మొక్కలను ట్రిమ్మింగ్ చేసి సోమవారం నాటికి అందంగా తీర్చిదిద్దాలన్నారు. పిచ్చి మొక్కలను తొలగించడం, నగరంలో గుర్తించిన పది ప్రాంతాల్లో మొక్కలు నాటించడం, కాంపౌండ్ వాల్ లకు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటించడం వంటి పనులను స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. నగరంలో చేపట్టిన ఏడు పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ జారీలో తేడాలు వస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బి.జ్యోతిలక్ష్మి, మున్సిపల్ ఇంజినీర్ ఇ.త్రినాధరావు, ఎసిపి పి.గౌర్, ఆర్ఒ వి.సోమశేఖర్, ఎఇ కె.శ్రీనివాస్, డిఇ నారాయణరావు, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారి ఆర్.విజయ్ పాల్గొన్నారు.

వృద్ధులకు చేయూతనందించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వృద్ధులకు చేయూతనందించడం మానవత్వమని దక్షిణ భారతదేశపు సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం చిన అమిరం విశ్వశాంతి వృద్ధాశ్రమంలోని 96 మందికి శనివారం పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ తన తల్లిదండ్రులను చదువు, వృత్తి రీత్యా చూసుకోలేకపోయాయని, వారు గతించిన తరువాత ఎంతా విచారించినా ఆ బాధ భరించలేకపోతున్నానని చెప్పారు. దీనిలో భాగంగానే రాష్ట్రంలోని అన్ని వృద్ధాశ్రమాలను సందరిస్తున్నానన్నారు. వృద్ధులకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్యులు జివి.రమణరావు, జి.నాగిరెడ్డి, చెరుకువాడ రంగసాయి, ఆశ్రమం నిర్వాహకులు భూపతిరాజు సత్యనారాయణ రాజు, గొట్టుముక్కల రామరాజు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

రైల్వే హమాలి కార్మిక సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా రైల్వే హమాలి కార్మిక సంఘం నాయకులు రమేష్ బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన పాలకొల్లు రైల్వే గూడ్స్ షెడ్ విశ్రాంతి భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశమై మాట్లాడారు. పని భద్రతకు కార్మికులు ఐక్యంగా ఆందోళనకు దిగాలన్నారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ కల్పించాలని కోరారు. తొలుత బిఆర్.అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, అంతర్వేది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

జగనన్న కాలనీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి సూచించారు. మండలంలోని పేరుపాలెం నార్త్ పంచాయతీ పరిధి అంబేద్కర్ కాలనీ, దేవునితోటలలో జగనన్న లే అవుట్లను ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మొగల్తూరులో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా జాతీయ ఉపాధి హామీ చట్టంలో చేపట్టిన చెరువు పనులను ఆమె పరిశీలించారు. ఆమెతో పాటు తహశీల్దార్ జి.అనితకుమారి, ఎంపిడిఒ ఆర్‌సి.ఆనంద్‌కుమార్, ఎపిఒ వై.శ్రీనివాస్, హౌసింగ్ ఎఇ ఫణీంద్ర ఉన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం

ప్రజాశక్తి - ఉండి

శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకానికి నేషనల్ బీ బోర్డు, కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో రూ.500 కోట్ల నిధులు కేటాయించారని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో కెవికె అధిపతి డాక్టర్ పి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తేనెటీగల ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై అవగాహన చాలా అవసరమని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో శిక్షణ పొందిన గ్రామీణ యువత, రైతులు శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం చేపట్టాలని ఆయన సూచించారు. విజయరాయి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.మోహన్‌రావు మాట్లాడుతూ శిక్షణ పొందిన గ్రామీణ యువత, రైతులు తప్పనిసరిగా తేనెటీగల పెంపకాన్ని చేపట్టి అధిక దిగుబడులు పొంది అదనపు ఆదాయాన్ని పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం టి.అనిల్‌కాంత్, యాదవ్, కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.రాజేష్, డాక్టర్ డెబోరా మెస్సియానా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ పి.వినయలక్ష్మి, రైతులు, గ్రామీణ యువకులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ఎపి నిట్ ఆచార్యులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖపట్నంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ (ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు) సమావేశంలో ఎపి నిట్‌లోని ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన ఆచార్యులు డాక్టర్ పెద్దపాటి శంకర్, కర్రి శ్రీ ఫణికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపి నిట్‌లో రూ.7.15 కోట్లతో చేపట్టిన కామన్ రీసెర్చ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ హబ్ ప్రాజెక్ట్ ద్వారా పునరుత్పాదక ఇంధన శక్తి వనరుల రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలను ప్రోత్సహించడానికి నిట్ విద్యా సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. ఎపి నిట్‌లో ఏర్పాటు చేసిన ఈ కామన్ రీసెర్చ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ హబ్ దేశంలో 18వది కాగా నిట్‌లలో మొట్టమొదటిదన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రానున్న నాలుగేళ్ల కాలంలో చేపట్టనున్న ప్రణాళికలు, లక్ష్యాలను నిర్వాహకులకు తెలియజేయడంతో పాటు సమావేశానికి హాజరైన వివిధ కంపెనీల ప్రతినిధులతో పలు పరిశోధనలపై చర్చించామని తెలిపారు. ఆచార్యులు శంకర్, ఫణి కృష్ణను నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్‌పడోలే, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జిఆర్‌కె శాస్త్రి, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సందీప్ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రణాళికాబద్ధంగా రీ సర్వే

ప్రజాశక్తి - కాళ్ల

భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా రీ సర్వే పనులు డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయని భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు తెలిపారు. కాళ్ల తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒ, సర్వేయర్లతో కలిసి జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం కార్యాచరణ, అమలుపై శనివారం సమీక్షించారు. త్వరితగతిన రీ సర్వే లో అన్ని రకాల ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కాళ్ల తహశీల్దార్ టివి.కృష్ణారావు, మండల సర్వేయర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - ఆచంట

కలియుగ వైకుంఠపురిగా పేరొందిన కొడమంచిలిలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామివారి తిరు వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మానేపల్లి రామలింగేశ్వరశర్మ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు హాజరై స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరుని కళ్యాణం అత్యంత వేడుకగా నిర్వహించారు. శ్రీమాన్ ఖండవల్లి సూర్యనారాయణ ఆచార్యులు శిష్య బృందం ఎంతో అద్భుతంగా స్వామి వారి కళ్యాణం జరిపించారు.

ఘనంగా కనకదుర్గ గ్రామోత్సవం

ప్రజాశక్తి పాలకొల్లు

యడ్ల బజార్‌లో ఉన్న కనకదుర్గ మల్లేశ్వరస్వామి వార్ల కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ శనివారం స్వామి వార్లను దర్శించుకున్నారు. తాతాజీకి ఆలయ పాలకమండలి ఛైర్మన్ కావలి శ్రీను ఆలయ మర్యాదాలతో స్వాగతం పలికారు. సభ్యులు గుండుబోయిన అరుణకుమారి, కెల్లా పెద్దిరాజు, రేలంగి నరసింహమూర్తి, మాజీ కౌన్సిలర్ కావలి చంద్రావతి, చెన్ను విజయ్, పెచ్చెట్టి కృష్ణాజీ, పిల్లా అప్పాజి, దాసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి - ఉండి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బి.సాయిచంద్ర అన్నారు. ఉండి పెదపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ బి.సాయిచంద్ర మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లిళ్ల చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. బాల్యంలోనే గర్భం దాల్చడం వల్ల గర్భాశయ ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. భార్యాభర్తల మధ్య సఖ్యత ఏర్పడక విడిపోయే ప్రమాదం అధికంగా ఉందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని 18 సంవత్సరాలు నిండిన యువతిక, 21 సంవత్సరాలు నిండిన యువకునికి మాత్రమే వివాహాలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్‌ఒ ఆర్.కృష్ణకుమార్, పిహెచ్‌ఎన్ కుమారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.మేరీ, అంగన్‌వాడీలు సిహెచ్.కుసుమ, ఎం.చైతన్య, జి.విజయకుమారి పాల్గొన్నారు.

ఆచంట :వివాహ వయసు దాటకుండా బాల్య వివాహాలు చేస్తే శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు తలెత్తి కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు టి.పోచమ్మ, కె.మోహన్‌రాణి తెలిపారు. ఆచంటలో శనివారం బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కిశోర బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జగన్నాధరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ రాజలక్ష్మి, హౌసింగ్ ఎఇ శ్రీమోహనరావు, నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మోహన్‌రావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెనుగొండ : బాల్య వివాహాలు చేయడం నేరమని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్తేర్ క్వీన్ అన్నారు. బాల వివాహాలు చేసుకోవద్దని శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్తేర్‌క్వీన్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అంగన్‌వాడీ టీచర్ తులసి మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు చేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాలఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలి : డిఎంహెచ్‌ఒ



ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపును పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతి ఒక్కరికీ వైద్యం అందేవిధంగా చూడడంతోపాటు, చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని జిల్లా వైద్యాధికారి(డిఎంహెచ్‌ఒ) మహేశ్వరరావు అన్నారు. పెన్నాడ గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంతో పాటు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని డిఎంహెచ్‌ఒ మహేశ్వరరావు శనివారం పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ గ్రామంలో ఉన్న రోగికి వైద్యం అందేలా చూడాలన్నారు. బెడ్ పేషెంట్‌ను, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందిన రోగులను, పాఠశాల విద్యార్థులను దగ్గరికి వెళ్లి పరీక్షించాలన్నారు. యుఐపి క్యాంపును ఎండలు విజృంభిస్తున్న నేపథ్యంలో ఉదయమే చిన్నపిల్లలకు వ్యాక్సిన్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యం విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం దగ్గరలో చెత్తాచెదారం పెరిగిపోయి పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా ఉందంటూ పెన్నాడ గ్రామానికి చెందిన ముసలయ్య ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించి పంచాయతీ అధికారులకు తగు సూచనలు అందించారు. డిఎంహెచ్‌ఒతో పాటు సిసి హరి, పాలకోడేరు పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ రంగంనాయుడు, డాక్టర్ స్వర్ణనిరంజని, సిహెచ్‌ఒ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు అయ్యప్ప శ్రీనివాస్, శంకర్, చండి రాణి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పాలకోడేరులో శనివారం నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రోగ్రామింగ్ అధికారి సుగుణరాజు పరిశీలించారు.

మహిళా దినోత్సవంలో భాగస్వామ్యం కావాలి
కార్మిక, ఉపాధ్యాయ, విద్యార్థి, మహిళా సంఘాల పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనం గా నిర్వహించడంతోపాటు అందరూ భాగస్వామ్యం కావాలని కార్మిక, ఉపాధ్యాయ, విద్యార్థి, మహిళా సంఘాలు పిలు పునిచ్చాయి. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం వివి ధ సంఘాల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సమావేశానికి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామభద్రం అధ్యక్షత వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఆరు పట్టణాల్లో సభలు, సదస్సులు, ఊరేగింపులు జర పాలని కార్మిక, ఉపాధ్యాయ, విద్యార్థి, మహిళా సంఘాలు ఈ సమావేశంలో నిర్ణయించాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు మాట్లాడుతూ ఎనిమిదో తేదీన భీమవరంలో ఊరేగింపు నిర్వహించి ప్రకాశం చౌక్‌లో సభ జరపాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లోనూ సభలు, సదస్సులు నిర్వహించి మహిళా లోకం ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విధానాలు, మహిళా చట్టాలు వంటి అంశాలను చర్చించాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరినీ ఐక్యం చేసి అవగాహన కల్పించే కార్యక్రమం చేయడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు పి.పూర్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు డి.పెద్దిరాజు, యుటిఎఫ్ నాయకులు రామకృష్ణంరాజు, సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మహిళల హక్కుల పరిరక్షణ కోసం చట్టాలు రూపొందించారని, ప్రతి మహిళ తన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కామన బాల సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల నాలుగో తేదీ నుంచి 11 వరకు మహిళా చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం మొగల్తూరులోని వైకెపి కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరి సత్యనారాయణ, ఎపిఎం ఎం సుభాషిణి, న్యాయవాదులు నారిన శ్రీనివాసరావు, ఇంజేటి జాన్‌కెనడి, యర్రంశెట్టి దేవేంద్రఫణికర్, నక్కా ఆనందబాబు, డి.చాముండేశ్వరి, పారా లీగల్ వాలంటీర్ డి.వరలక్ష్మి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



ఆకివీడులో...

ఆకివీడు:అంగన్‌వాడీలు మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ న్యాయవాదులు ఎన్.సత్యవిజ్ఞానదేవి, ఎం.జ్యోతి సూచించారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక స్త్రీ శిశుసంక్షేమ శాఖ కార్యాలయంలో మహిళా చట్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బందికి మహిళా చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సిడిపిఒ రత్నకుమారి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాలకొల్లు : ఈ నెల ఎనిమిదో తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా పాలకొల్లు నారాయణ స్కూలులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయ సింధు మాట్లాడుతూ మహిళలు సెల్‌ఫోన్లను జాగ్రత్తగా వినియోగించాలన్నారు. లేకుంటే సైబర్ నేరాల బారిన పడాల్సి వస్తుందని హెచ్చరించారు. తొలుత స్కూలులో జరిగిన సైన్స్ ఉత్సవంలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడారు. విద్యతో పాటు ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు వల్ల విద్యార్థులు మరింత చురుకుగా ఉంటారని చెప్పారు.

జాతీయ భద్రతా దినోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రతి అంశానికి భద్రత అవసరమని, భద్రత లేని జీవితాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని హెడ్ పోస్ట్‌మాస్టర్ కె.అషిబాబు అన్నారు. భీమవరం పోస్టల్ శాఖ కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో 52వ జాతీయ భద్రతా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అషిబాబు మాట్లాడుతూ పోస్టల్ శాఖ పిల్లల భవిష్యత్‌కు సుకన్య యోజన పథకం ద్వారా భద్రత కల్పిస్తున్నారన్నారు. ఇటువంటి అవగాహన వేడుకలు సమాజానికి అవసరమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మన భద్రత కోసం ప్రభుత్వ శాఖలన్ని సంక్షేమ పథకాలుగా ప్రవేశ పెడతున్నాయరన్నారు. భద్రత రహిత్యం, నిర్లక్ష్య వైఖరి మంచిది కాదన్నారు. సుకన్య యోజన పథకానికి రూ.పది వేలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ యూనియన్ సెక్రటరీ సిహెచ్.లెనిన్‌బాబు, విఆర్ఐ ఎల్.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్ కళాశాలలో అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్(ఎసిఐసి)ను నీతిఆయోగ్, అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా మంజూరు చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన కలిగిన నీతిఆయోగ్ తమ కళాశాలకు అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ మంజూరు చేయటం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. దీని ద్వారా గోదావరి, కృష్ణా జిల్లాల్లో లభ్యమవుతున్న వనరులతో రైతాంగానికి ప్రజలకు ఉపయోగపడేలా పరిశ్రమలను ప్రోత్సహించటం, స్టార్టప్‌లను ఏర్పాటు చేయించడం వంటి కార్యక్రమాలు ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా చేసేందుకు ఆస్కారం ఉంటుందని ఆయన వెల్లడించారు. ఇందుకు కళాశాల యాజమాన్యం కూడా ఒక ప్రత్యేక ప్రయోగశాలను ఏర్పాటు చేసి అందులో సాంకేతిక నిపుణులను నియమించి స్టార్టప్‌లు ప్రారంభించేవారికి సాంకేతికంగా చేయూత అందిస్తామని తెలిపారు. కృష్ణా, గోదావరి జిల్లాల్లో అపారంగా వనరులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే ఈ ప్రాంత ప్రగతికి ఎన్నో పరిశ్రమలు ప్రారంభించవచ్చని చెప్పారు. ఇందుకు యువతను ప్రోత్సహించి వారికి మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఇక్కడున్న వనరులతో బిజినెస్ డెవలప్‌మెంట్ చేయగలిగితే అపారమైన సంపదను పొందవచ్చన్నారు. ఇందుకు యువతలో చైతన్యం రావాలని, అందుకు ఇటువంటి సెంటర్లు దోహదపడతాయని చెప్పారు. అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ సిఇఒగా వెట్ సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ నంద్యాల శివ కిషన్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆర్‌అండ్‌డి డాక్టర్ పి.రామకృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి, సిఇఒ ఎన్.శివకిషన్, సిఎస్‌డి విభాగం హెడ్ డాక్టర్ ఎం.సురేష్‌బాబు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో సాగు నీరందించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సాగునీటి ఎద్దడి లేకుండా పూర్తిస్థాయిలో నీరందించాలని తహశీల్దార్ దండు అశోక్‌వర్మ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం జుత్తిగ పరిధిలోని ఓల్డ్ గోటేరు కెనాల్ పరిధిలో వంతులవారీ విధానం వల్ల జుత్తిగ, మల్లిపూడి, అర్జునుడుపాలెం గ్రామాల్లోని 456 ఎకరాలకు, మావుళ్లమ్మ ఏరియాలో 80 ఎకరాలకు సాగునీరు అందడం లేదని రైతులు తహశీల్దార్‌కు మొరపెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తహశీల్దార్ స్పందిస్తూ వరి పైరు ఎండిపోతుంటే ఇప్పటి వరకు ఏం చేస్తున్నారని ఇరిగేషన్ గుమస్తా రబ్బనీ, లస్కర్ వెంకటేశ్వరరావును ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించి సాగునీటి సమస్య పరిష్కరించాలని ఇరిగేషన్ ఎఇ సత్యనారాయణకు ఫోన్ చేసి ఆదేశించారు. కార్యక్రమంలో రైతులు తమనంపూడి వీర్రెడ్డి, కర్రి వెంకటరెడ్డి, కొవ్వూరి కోదండరామారెడ్డి, సత్తి శ్రీరామారెడ్డి, తమనంపూడి సోమిరెడ్డి, ఇళ్ల రాఘవులు, కౌరు శ్రీనివాస్, గూడూరి మాధవరావు, తమనంపూడి మహేంద్రరెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వెలగల సోమిరెడ్డి పాల్గొన్నారు.